క్లుప్తంగా

పశువైద్యశాల తనిఖీ



రికార్డు తనిఖీ చేస్తున్న రమేశ్‌కుమార్

కోటపల్లి: స్థానిక పశువైద్యశాలను జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రమేశ్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో జరుగుతున్న గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల పురోగతిని పశువైద్యాధికారి పవన్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నా రు. ప్రతి పశువుకు టీకా అందేలా చూడాలని, తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండో విడత గొర్రెల పంపిణీలో ఇప్పటి వరకు 19యూనిట్లు మంజూరు అయినట్లు వివరించారు.

పశువులకు ఉచిత టీకాలు, మందులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ర్యాలీ, చిన్నగోపాల్‌పూర్ గ్రామ పంచాయతీల్లో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత నట్టల నివారణ, గాలికుంటు నివారణ టీకాలు వేశారు. గ్రామాల్లోని మొత్తం 380ఆవులు, ఎడ్లు, 116గేదెలకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారిణి శాంతిరేఖ తెలిపారు. పశువైద్య సిబ్బంది అగ్నివేశ్, సికిందర్, నారాయణ, గోపాలమిత్ర రమేశ్, పశు రైతులు పాల్గొన్నారు.

అప్రెంటిషిప్ మేళా

మంచిర్యాలఅర్బన్: ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు ఈ నెల 24న మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. మేదా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్‌లో ఎలక్ట్రీషియన్ -150, ఫిట్టర్ 150, ఎలక్ట్రానిక్స్-50, ఇన్స్ట్రుమెంట్ మెకానిక్-40 ఖాళీలున్నాయన్నారు. ఆసక్తి అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఐటీఐలో సంప్రదించాలన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్ట్‌కు ఆహ్వానం

కోటపల్లి: స్థానిక మోడల్ కళాశాలలో పీజీటీ కెమిస్ట్రీ బోధించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ కలిగి ఉండి 2సంవత్సరాల అనుభవం ఉన్నవారు, నేరుగా ఈ నెల 24న జరిగే డెమోకు హాజరుకావాలని కోరారు.

తహసీల్దార్‌గా సదానందం



వేమనపల్లి: స్థానిక తహసీల్దార్‌గా సదానందం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ రాజ్‌కుమార్ ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లగా, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ తహసీల్దార్‌గా పనిచేసిన సదానందంను ఎన్నికల బదిలీల్లో భాగంగా వేమనపల్లి తహసీల్దార్‌గా నియమించారు.

చర్యలు తీసుకోవాలి

చెన్నూర్‌రూరల్: మండలంలోని సోమనపల్లి గ్రామంలోని బంజేరు భూమిని కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటున్నామని పొన్నారం గ్రామానికి చెందిన కస్తూరి రాజేష్ తెలిపాడు. ఈ భూమిలో సాగు చేసుకుంటున్న పంటను కొందరు ధ్వంసం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని, నష్ట పరిహారం ఇప్పించాలని కోరుతున్నాడు.

'గడపగడపకూ పీఎస్సార్'

మంచిర్యాలటౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. గడపగడపకూ పీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని 10వ వార్డు ఏసీసీలో గడపగడపకూ వెళ్లి, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

లక్సెట్టిపేట: మండలంలోని పలువురు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మంగళవారం మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్ రావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో పట్టణానికి చెందిన బాణాల రమేష్, కల్వల వెంకటేష్, సయ్యద్ హాఫీజ్ ఉన్నారు.

మురికిగా భగీరథ నీరు



నెన్నెల: మండల కేంద్రంలో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న శుద్ధ జలం ఇంటింటికీ చేరేసరికి 'గరళం'గా మారుతుంది. నల్లాల ద్వారా సరఫరా అవుతున్న నీరు తాగడానికి వీలు లేకుండా మురికిగా రావడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ నల్లాల ద్వారా సరఫరా అయ్యే మోటారు చెడిపోయి రెండు రోజులు కావడంతో మంగళవారం మిషన్‌భగీరథ వాటర్‌ట్యాంకు ద్వారా సరఫరా అయిన నీరు మురి కిగా రావడంతో ప్రజలు వాడేందుకు ఇష్టపడలేదు. వాటర్‌ట్యాంకులను సంవత్సరాల నుంచి శుభ్రం చేయకపోవడం, లీకేజీలకు మరమ్మతు లేక నీరు కలుషితమవుతుంది. ప్రజలు పలుమార్లు విషయాన్ని పంచాయతీ, మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

దళిత బంధు ..ఏది?

- ఎదురుచూస్తున్న అర్హులు
- మొదటి విడతలో కొందరికి లబ్ధి
- రెండో విడత ఊసేలేదు

(2014 ఎస్‌కేఎస్ సర్వే ప్రకారం జిల్లాలో ఎస్సీ కుటుంబాలు, జనాభా)
ఎస్సీ కుటుంబాలు : 64,455
ఎస్సీ జనాభా : 2,13,575



దండేపల్లి: దళితుల సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన పథకం 'దళిత బంధు'. దీనిని 2021లో వాసాలమర్రిలో సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఒక్కో దళిత కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల సాయం అందిస్తుంది. దీంతో దళితులు ఆర్థికంగా ఎదిగేందుకు, వ్యాపారాభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగించుకోవాలన్నారు. హుజురాబాద్ ఉప ఎన్నికల సమయంలో దళితబంధు పథకాన్ని ఆ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు చేపట్టారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా దీనిని విడతల వారీగా అమలు చేస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో మొదటి విడతలో 313మంది లబ్ధిదారులను ఎంపిక చేసి, వారికి ఈ పథకం కింద సాయం అందించారు. ఇక రెండో విడత గురించి ఎలాంటి ఊసే లేకపోవడంతో, జిల్లాలో దళితబంధు పథకం పై ఆశలు పెట్టుకున్న ఆశవహులు, రెండో విడత కోసం ఎదురుచూస్తున్నారు. రెండో విడత ఊసే లేకపోవడంతో, జిల్లాలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పలు కుంటుబాలు ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. రెండో విడత వెంటనే ప్రారంభించి అర్హులైన వారికి అందించాలని దళిత సంఘాల నాయకులు కోరుతున్నారు.

మొదటి విడతలో 313 మందికే..

జిల్లాలో 64,455ఎస్సీ కుటుంబాలు ఉండగా, దళితబంధు మొదటి విడతలో నియోజకవర్గానికి వంద చొప్పున, జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి మూడు నియోజకవర్గాలకు కలుపుకుని 300కాగా, జన్నారం మండలం ఖానాపూర్ నియోజకవర్గంలో ఉండి, జిల్లా మంచిర్యాల కావడంతో ఆ మండలంలో 13మందికి అందించారు. దీంతో మొదటి విడతలో మొత్తం 313మందికి మాత్రమే దళితబంధు అందించారు. మొదటి విడత లబ్ధిదారుల ఎంపికలో, మండలంలో ఒక్క గ్రామం నుంచే లబ్ధిదారులను ఎంపిక చేసి, మిగితా గ్రామాల వారికి అవకాశం కల్పించకపోవడంతో, మిగితా గ్రామాల ఎస్సీ కుటుంబాల వారు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. లబ్ధిదారుల ఎంపికకు ఒక్క గ్రామాన్నే కాకుండా, జిల్లాలో అర్హులైన వారందరి నుంచి దరఖాస్తులు స్వీకరించి, అందరికీ అందించాలని కోరుతున్నారు. దళితబంధు పథకంలో మొదటి విడతలో అధికార పార్టీ నాయకులు చేతివాటం ప్రదర్శించి, లబ్ధిదారుల నుంచి పర్సెంటేజీలు తీసుకున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తం అయ్యాయి. కొన్నిచోట్ల లబ్ధిదారులకు కేవలం 60శాతం, 70శాతమే అందగా, మిగితా మధ్యవర్తులు, అధికారపార్టీ నాయకులు పర్సెంటేజీల కింద తీసుకున్నట్లు సమాచారం. ఈ సారి అలా కాకుండా అర్హులను గుర్తించి, పథకాన్ని అందించి దళితుల ఆర్థిక అభివృద్ధికి చేయూతనందించాలని పలువురు కోరుతున్నారు.

అర్హులందరికీ అందించాలి

దళితబంధు పథకాన్ని ఒక్కొక్క గ్రామానికి కాకుండా, అన్ని గ్రామాల్లో అర్హులైన వారందరినీ గుర్తించి పథకాన్ని అందించాలి. రెండో విడత వెంటనే ప్రారంభించాలి. మొదటి విడతలో కొందరికి రావడంతో, మిగితా గ్రామాల్లో ఆశవహులు ఎదురు చూస్తున్నారు.

- లింగంపల్లి బాపు, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు

అర్హులకు అందిస్తాం..

దళితబంధు పథకాన్ని ప్రభుత్వం విడతల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేసి, ఒక్కో కుటుంబానికి రూ.10లక్షల సాయం అందిస్తోంది. జిల్లాలో మొదటి విడతలో 313మందికి అందించాం. రెండో విడతలో నియోజకవర్గానికి 1100మందికి అందించాలన్నారు. రెండో విడతకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు రాగానే లబ్ధిదారులను గుర్తించి అర్హులకు అందిస్తాం.

- దుర్గప్రసాద్, ఎస్సీకార్పొరేషన్ ఈడీ

కరాటేలో మైనారిటీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన మైనారిటీ పాఠశాల విద్యార్థినులు



వీవెన్ రాజ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన విద్యార్థినులు ఇటీవల మందమర్రిలో నిర్వహించిన మొదటి నేషన్ లెవల్ కరాటే, కుంగుఫూ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభను చాటారు. టీమ్‌కటా విభాగంలో ఆస్మ, అర్షియా, అమ్రిన్, మహేక్ సుల్తానా, లాస్యశ్రీ, గౌసియాలు ప్రథమ సాధనంలో, షాహెస్తా, వైష్ణవి, సాయి ప్రణవి, సమ్రీన్, నాజ్‌లు ద్వితీయ బహుమతులను సాధించగా, వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ దమయంతి, పీఈటీ రజిత, కరాటే కోచ్ ఎం.నాగలక్ష్మి, ఎం.సరీశ్‌లు విద్యార్థినులను అభినందించారు.

బెల్లంపల్లిరూరల్: మంచిర్యాల జిల్లా మందమర్రిలో ఈ నెల 20, 21తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో బెల్లంపల్లి విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడు. బెల్లంపల్లిలోని శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన ట్వైకాండో విద్యార్థి ఎస్.వీవెన్ రాజ్ స్పారింగ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించి ఔరా అనిపించాడు. పాఠశాలలో వీవెన్ రాజ్‌ను మంగళవారం ట్వైకాండో జిల్లా కార్యదర్శి బోగే రాజేశ్, కోశాధికారి చిరంజీవి, అధ్యక్షుడు మోహన్, పాఠశాల ప్రిన్సిపాల్ సంజీవ్, పీఈటీ రాంబాబు నాయక్‌లు అభినందించారు. పోటీల్లో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు.

బుగ్గలో 'చంద్రయాన్-3' పూజలు



హోమం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బెల్లంపల్లిరూరల్: ఇస్రో పంపిన చంద్రయాన్-3 విజయవంతంగా చందమామ పై ల్యాండ్ కావాలని మంగళవారం బెల్లంపల్లిలో పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీ బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితుల వేదమంత్రోచ్చరణల మధ్య కార్యసిద్ధి హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ మాసాడి శ్రీదేవి, ఆలయ కమిటీ సభ్యులు అభినవ సంతోష్, గోపి, కన్నాల సర్పంచ్ స్వరూప, పండితులు వేణుగోపాలశర్మ, సతీ ష్ శర్మ, స్థానికులు శ్రీరాములు పాల్గొన్నారు.



సెకండ్ ఏఎన్ఎంల నిరసన

పాతమంచిర్యాల: తమ ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని 7రోజులుగా జిల్లా కేంద్రంలో నిరసన దీక్ష చేపట్టిన ఏఎన్ఎంలు మంగళవారం దీక్ష శిబిరంలో ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే-ఓసీపీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐకే-ఓసీపీ గని మేనేజర్ బ్రహ్మజీకి హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఓసీపీలో 9మిషనరీలు ఉండగా, కేవలం నలుగురు ఆపరేటర్లు మాత్రమే ఉన్నారని తెలిపారు. పని ఒత్తిడవుతుందని పేర్కొన్నారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించగా స్పందించిన మేనేజర్ తన పరిధిలో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సారయ్య, పెద్దయ్య, కొమురయ్య, శ్రీను, శ్రీకాంత్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు



బ్రహ్మజికి వినతిపత్రం ఇస్తున్న హెచ్ఎంఎస్ నాయకులు

పోస్టర్ ఆవిష్కరణ

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట, కాసిపేట-2 గనులపై మంగళవారం ఏఐటీయూసీ కేంద్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల 25, 26, 27తేదీల్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ 16వ మహాసభలు గోదావరిఖనిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, కాసిపేట గని ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

'ప్రాధాన్యం ఇవ్వాలి'

మందమర్రిరూరల్: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరిగేంత వరకు అన్ని కార్మిక సంఘాలకు యాజమాన్యం ప్రాతినిధ్యం ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ(జీఎల్‌బీకేఎస్) నాయకులు డిమాండ్ చేశారు. ఏరియా పర్సనల్ మేనేజర్‌ను మంగళవారం కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు మేకల రాములు, అసిస్టెంట్ సెక్రెటరీ సుధాకర్, నాయకులు చంద్రమొగిళి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ శ్రేణుల సంబురాలు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు దుర్గం చిన్నయ్య, బాల్క సుమన్‌లను సీఎం కేసీఆర్ ప్రకటించడంతో మంగళవారం టీబీజీకేఎస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. బెల్లంపల్లిలోని శాంతిఖని గని వద్ద బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి పెట్టి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ శాంతిఖని గని ఫిట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ సభ్యుడు రాయలింగు, ఏరియా ఆసుపత్రి ఫిట్ కార్యదర్శి అనుముల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్, డీసీపీలను కలిసిన జీఎం



మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాకు నూతనంగా వచ్చిన జీఎం మనోహర్ మంగళవారం మంచిర్యాల కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్, డీసీపీ కార్యాలయానికి వెళ్లి డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్‌కు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి ఉన్నారు.

బ్రాంచి కార్యదర్శిగా మల్లేష్

కాసిపేట: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శిగా సోమగూడెంకు చెందిన దాగం మల్లేష్ రెండోసారి ఎంపికయ్యాడు. బ్రాంచి 16వ మహాసభల్లో ముఖ్య అతిథిగా కామ్రేడ్ సీతారామయ్య, మిట్టపల్లి వెంకటస్వామి ఆధ్వర్యంలో నూతన కౌన్సిల్ కార్యవర్గం, ఆఫీస్ బేరర్స్‌తో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొని ప్రకటించినట్లు తెలిపారు. బ్రాంచి కార్యదర్శిగా మల్లేష్, ఉపాధ్యక్షుడిగా బియ్యాల వెంకటస్వామి, సహాయ కార్యదర్శిగా దాసరి తిరుపతిగౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎం.లక్ష్మీనారాయణ, డి.ఆర్.శ్రీధర్, ఎం.రవీందర్, సుభాష్‌చంద్రబో స్, కోశాధికారిగా రాజేశ్వర్‌రావును ఎన్నుకున్నట్లు తెలిపారు.

హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి

నస్పూర్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని పలువురు ప్రైవేటు సెక్యురిటీ సిబ్బంది తెలిపారు. ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది మంగళవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మిట్టపల్లి మొగిళి, రామదేని శ్రీనివాస్, సిరిపురం రాజేశ్ మాట్లాడారు.సమాన పనికి, సమాన వేతనం చెల్లించాలని కోల్ ఇండియాలో వేతనాలు చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో అబ్బగాని సంపత్, కలవేణ స్వామి, నస్పూర్ బాపు, మధు, వెంకటేశ్, నరేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్

నస్పూర్: భారతదేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఐఐటీ, ఐఐఎంలలో 2023-24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ పొందిన ఎస్‌సీడబ్ల్యూఏ ఉద్యోగుల పిల్లలకి సింగరేణి సంస్థ ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీం ద్వారా ఫీజు రీయింబర్స్ ఇస్తున్నట్లు ఏరియా పర్సనల్ జీఎం అరవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల పిల్లలు ఎవరైనా ఐఐటీ, ఐఐఎంలలో అడ్మిషన్ తీసుకున్నట్లైతే, వారి గనులు, విభాగాల్లో అడ్మిషన్ లెటర్ ట్యూషన్‌ఫీజు రశీదుతో సంప్రదించాలని సూచించారు.

కేకే ఓసీని సందర్శించిన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి క్వార్టర్స్‌లో ఇల్లీగల్‌గా చొరబడిన వారి వివరాలను మందమర్రి ఏరియా జీఎం మనోహర్‌ను సింగరేణి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శశిధర్ రాజు అడిగి తెలుసుకున్నారు. మందమర్రి ఏరియాకు మంగళవారం వచ్చిన ఆఫీసర్ ఏరియాలోని కేకే ఓసీని సందర్శించి పని ప్రదేశాలను పరిశీలించారు. కోల్‌బంకర్ ఇన్, ఔట్‌పుట్ చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఓసీ ఆవరణలో సీసీ టీవీ ఫుటేజీల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- కొనసాగుతున్న ప్రవాసయోజన కార్యక్రమం



మాట్లాడుతున్న అభిమన్యు దత్తాత్రేయ పవార్

జన్నారం: వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామనే భయం సీఎం కేసీఆర్‌లో స్పష్టంగా కనిపిస్తోందని, అందుకే అభ్యర్థులను మార్చారని మహారాష్ట్ర ఎమ్మెల్యే తుషార్ రాథోడ్, బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఆరోపించారు. మండల కేంద్రంలో జరిగిన 'ప్రవాసయోజన' కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన జన్నారం మండల కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఓటమి భయంతోనే కేసీఆర్ రెండు చోట్ల పోటీ చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రతీ పథకంలో బీఆర్ఎస్ నాయకులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. 9ఏళ్ల పాలనలో మిగులు రాష్ట్రమైన తెలంగాణను, అప్పుల పాలు చేశారని విమర్శించారు. మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వచ్చె ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. అనంతరం గీత కార్మికులతో, బీడీ కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పెంబి జెడ్పీటీసీ జానుబాయి, బీజేపీ నియోజకవర్గ నాయకుడు హరినాయక్, శేఖర్, మండల అధ్యక్షుడు గోలి చందు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, ఎంపీటీసీ శంకరయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమిని: బెల్లంపల్లి నియోజకవర్గంలో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కర్ణాటక రాష్ట్ర సులియ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే భగీరథీ మురల్య పిలుపునిచ్చారు. కన్నెపల్లి మండలంలోని టేకులపల్లిలో మంగళవారం 'ప్రవాస్‌యోజన' కార్యక్రమంలో భాగంగా భీమిని, కన్నెపల్లి మండలాల సంయుక్త కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపించడానికి కార్యకర్తలు సైనికులుగా పని చేయాలన్నారు. బూత్ స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ, ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొయ్యాల ఏమాజీ, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవరెడ్డి, భీమిని, కన్నెపల్లి మండలాల బీజేపీ అధ్యక్షులు కొంక సత్యనారాయణ, రామయ్యయాదవ్, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

నెన్నెల: బెల్లంపల్లి నియోజకవర్గంలో బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా బీజేపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని కర్ణాటక ఎమ్మెల్యే భగీరథీ మురళ్య పిలుపునిచ్చారు. నెన్నెల మండలంలోని నందులపల్లిలో మంగళవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీని పూర్తి స్థాయిలో నిర్మించి బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొయ్యల ఏమాజీ, బీజేపీ మండల అధ్యక్షుడు శైలేందర్‌సింగ్, నాయకులు పాల్గొన్నారు.

'కార్మికుల సంక్షేమానికి పథకాల అమలు'

నస్పూర్: ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అనేక భీమా పథకాలు అమలు చేస్తుందని మహారాష్ట్ర ఔసా ఎమ్మెల్యే అభిమన్యు దత్తాత్రేయ పవార్ తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని సీహెచ్‌పీ వద్ద మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌తో కలిసి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించి, పన్నును సింగరేణి సంస్థ భరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లిస్తామని పేర్కొన్నారు. సింగరేణి సొమ్మును కల్వకుంట్ల కుటుంబం దోచుకుంటుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కడాసు భీమయ్య, జోగుల ప్రభాకర్, పంచెర్పుల నరేశ్, సందీప్, నరేందర్, వినోద్, ఈశ్వర్, సురేష్, కొండ వెంకటేశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'టికెట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం'

పాతమంచిర్యాల: బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులలో బీసీలకు అన్యాయం జరిగిందని బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 60శాతం ఉన్న బీసీలకు 20శాతం టికెట్లు కేటాయించడాన్ని తప్పుబట్టారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న బీసీలు పార్టీని వీడి, బీసీ ఉద్యమానికి అండగా నిలవాలన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో పల్లెపల్లెన, వాడవాడనా తిరిగి బీసీ ఎమ్మెల్యేను గెలిపించుకోవడానికి ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు.

నస్పూర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థుల్లో బీసీలకు తక్కువ సీట్లు కేటాయించి అన్యాయం చేసిందని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ తెలిపారు. ఐక్యవేదిక సంఘాల నాయకులు మంగళవారం సీసీసీ కార్నర్ వద్ద మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బీసీలకు 65సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తే కేవలం 23స్థానాలు కేటాయించిందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఏ పార్టీ బీసీలకు అధిక స్థానాలు కేటాయిస్తుందో, ఆ పార్టీకే బీసీలు అండగా ఉండాలని కోరారు.

ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై చర్య తీసుకోవాలి

జన్నారం: 20సంవత్సరాలుగా బలరాంనాయక్ సాగు చేసుకుంటున్న భూమిలో లక్ష్మీపూర్ తాండాకు చెందిన కొందరు వచ్చి, గుడిసెలు వేసుకుని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు అశోక్ మంగళవారం డిమాండ్ చేశారు. పత్తి పంటను నాశనం చేసి, ఇళ్లు నిర్మించుకోవడం సరికాదన్నారు. ఈ విషయంలో అధికారులు దృష్టి సారించి, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

బోదకాలు నివారణ మాత్రలు మింగించాలి

దండేపల్లి: బోదకాలు నివారణ మాత్రలు పంపిణీ చేయడమే కాకుండా వారితో తప్పక మింగించాలని, మాస్‌డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ మంచిర్యాల వైద్యాధికారులు రామ్మూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్ అన్నారు. దండేపల్లి మండలంలోని గూడెం, నంబాల, వెల్గనూర్, ద్వారక, మేదరిపేట గ్రామాల్లో బోదకాలు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం వారు పరిశీలించారు.

వైద్యాధికారికి సమ్మె వినతిపత్రం

వేమనపల్లి: ఈ నెల 31నుంచి ఎన్‌హెచ్ఎం ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోరుతూ జాతీయ ఆరోగ్య మిషన్‌లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులు సమ్మెకు పూనుకోగా, వేమనపల్లి వైద్యాధికారి రాజేష్‌కు ఎన్‌హెచ్ఎం జిల్లా సంయుక్త కార్యదర్శి బాపుయాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన

చెన్నూర్‌రూరల్: మండలంలోని బుద్దారం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర గొర్రె, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా బాల్క సుమన్‌కు రెండో సారి టికెట్ ఖరారు చేసినందుకు గాను సీఎ కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.


'కేసీఆర్ పాలనలోనే న్యాయం'

బెల్లంపల్లిరూరల్: కేసీఆర్ పాలనలోనే నేతకాని సామాజిక వర్గానికి తగిన న్యాయం జరిగిందని నేతకాని మహార్ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దుర్గం గోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలాలి నర్సయ్య అన్నారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా నేతకాని వర్గానికి చెందిన ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను మూడో సారి సీఎం కేసీఆర్ ప్రకటించడం హర్షనీయమన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి

జన్నారం: హైదరాబాద్ నడిబొడ్డున గిరిజన మహిళను చిత్రహింసలకు గురి చేసి, అవమాన పరిచిన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకుని సర్వీసు నుంచి తొలగించాలని బంజార సేవ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌నాయక్ డిమాండ్ చేశారు.

ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మంచిర్యాల అర్బన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయనందుకు మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు తిరుపతి, సుమలత, వైష్ణవి, రమేష్, రాజు, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.